# బోనాలు

*A Devotional Offering to Mother Goddess*



భాషా సాంస్కృతిక శాఖ

దేవాదాయ ధర్మాదాయ శాఖ

# బోనాలు

*A Devotional Offering to Mother Goddess*




పరిశోధన–రచన

డా॥ మామిడి హరికృష్ణ



**భాషా సాంస్కృతిక శాఖ**
కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్.

**దేవాదాయ ధర్మాదాయ శాఖ**
తిలక్ రోడ్, హైదరాబాద్



# బోనాలు

*A Devotional Offering to Mother Goddess*

© భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం

పరిశోధన-రచన : **డా॥ మామిడి హరికృష్ణ**
ఛాయాచిత్రాలు: **అర్జున్ & ఇతరులు**
ద్వితీయ ముద్రణ: **2025**
ప్రతులు: 1000
వెల: రూ. 150/-

© Department of Language & Culture
Govt. of Telangana

Research & Written by : Dr. Mamidi Harikrishna
Photography: Arjun & Others
Second Edition : 2025
Copies : 1000
Price : Rs. 150/-

ISBN : 978-81-965636-9-1

**Published By:**

**Dr. Mamidi Harikrishna**
**Director**, Department of Language & Culture
Kala Bhavan, Ravindra Bharathi, Hyderabad - 5000 004.
Phone : 040-29703142.

**Venkata Rao IAS**
**Director**, Department of Endowments
Thilak Road, Hyderabad -

**Book Sale's Available at :** All leading book shops in the country
Sales Counter at Ravindra Bharathi Complex, Hyderabad.
Ph: 040-29703142.

*Cover page painting:* **Kapu Rajaiah** *Back cover painting:* **D. Vykuntam Naqash**

*Printed at:* **Sai Likhita Printers**
Khairatabad, Hyderabad, Ph: **72070 45979**

All rights reserved. No part of this book may be reproduced or utilized
in any form or by any means without prior permission
in writing from Department of Language & Culture.

# బోనాలు

*A Devotional Offering to Mother Goddess*

అచ్చమైన పల్లె సంస్కృతికి సంకేతం...
నిఖార్సయిన గ్రామ సంప్రదాయానికి సందేశం...
అసలైన జీవనోత్సవానికి సంతకం...
అబ్బురపడే పండుగల సంబురం... తెలంగాణా!

అనాది విశ్వాసాలను
ఆధునిక శైలులను సమన్వయంచేసిన
జీవన పతాకం తెలంగాణా!

తెలంగాణా!
ఉద్యమం తలకెత్తుకున్న హృదయ బోనం!
ప్రజల గొంతు నినదించిన అస్తిత్వ గానం!

గ్రామీణ సంస్కృతిలోనే తెలంగాణ నేల తనని తాను ఆవిష్కరించుకుంటుంది!

ప్రతి సమాజం, జాతి తన అస్తిత్వాన్ని, తనదైన సొంత తనాన్ని, తనదైన ప్రత్యేకతని వెల్లడి చేసే అంశాలలో దాని సాంస్కృతిక వ్యక్తీకరణలు ముఖ్యమైనవి. అలాంటి సాంస్కృతిక వ్యక్తీకరణలలో అత్యంత ప్రభావవంతమైనవి ఆ జాతి, సమాజం నిర్వహించుకునే పండుగలు, పబ్బాలు, పర్వదినాలు, ఉత్సవాలు అని చెప్పాలి.

సమాజం తనని తాను ప్రపంచానికి పరిచయం చేసుకోవడానికి దోహదపడే సాంస్కృతిక ప్రతీకలలో అగ్రస్థానంలో నిలిచేవి పండుగలే. తెలంగాణా సమాజానికి సంబంధించి అటువంటి వాటిలో బతుకమ్మ, బోనాలు అత్యంత కీలకమైనవి. ఈ పండుగలు ఈ ప్రాంతంలో ఈ గడ్డమీద పుట్టి, అనూహ్యంగా కొనసాగుతూ ప్రజల హృదయ స్పందనకు నిలువుటద్దంలా నిలిచాయి.

వందలాది ఏళ్ళ క్రితం ఏ పర్యావరణ, సామాజిక ప్రయోజనం కోసమో అంకురించిన ఈ పండుగలు, ఆ తర్వాత తెలంగాణ ప్రాంత ప్రజల 'ఐడెంటిటీ'గా రూపాంతరం చెందాయి. ప్రజలందరిలో ఐక్యత భావనను, ఏకత్వ స్ఫూర్తిని రగిలించాయి. ప్రధానంగా మహిళలే జరిపే ఈ పండుగలు జన జీవన సాంస్కృతిక చైతన్యానికి కేతనాలుగా నిలిచాయి. "మన కట్టు, మన బొట్టు, మన బోనం" అనే మాటలు ప్రజల గుండెల్లో శాశ్వతాక్షరాలుగా మిగిలిపోయేలా చేసాయి.



ప్రజల అస్తిత్వానికి, సూచికగా, ఆకాంక్షలకు ప్రతీకగా, ఆత్మగౌరవ ఉద్యమానికి పతీకగా నిలిచిన వాటిలో మన భాష, మన యాస, మన గోస, మన తిండి, మన బోనం కూడా ఉన్నాయి. అందుకే తెలంగాణ ప్రాంతాన్ని అర్థం చేసుకోవడానికి ఓ అందమైన రాజమార్గం- "బోనాల ఉత్సవం"!.

ఇంతకీ బోనం అంటే ఏమిటి?

'భోజనం' అనే మాటకి గ్రామీణ వ్యావహారిక పదం 'బోనం'!

అయితే ఈ బోనం అనే పదానికి సాదాసీదా ఆహారం అనే సంకుచితార్థం కాకుండా విస్తృతార్థం ఉంది. తమని, తమ కుటుంబాన్ని, తమ జాతి ప్రజలని చల్లగా చూడాలని, రోగం, కష్టం, కరువు, విపత్తుల నుంచి తమను రక్షించాలని దేవతలను కోరుకుంటూ, వారి ఆగ్రహానికి గురికాకుండా వారిని సంతృప్తి పరచడానికి అనాదికాలంలోని ఆదిమ జాతుల ప్రజలు ఎన్నుకొన్న మార్గం ఇది...!

కాలాలు మారినా, తరాలు మారినా, శాస్త్రీయత, ఆధునికత, సాంకేతికత ఎంత ఎదిగినా, మన ఆచారాలు ఏ మాత్రం సడలని తీరుకు సజీవ సాక్ష్యాలు ఈ బోనాల ఉత్సవాలు.

అయితే తెలంగాణ ప్రాంతానికే ప్రత్యేకమైన ఈ బోనాలు పండుగ గురించి పూర్తిగా అవగాహన కలగాలంటే ముందుగా "గ్రామీణ దేవతారాధన", "మాతృదేవతా భావన" లను విశ్లేషించడం అవసరం. ఎందుకంటే బోనాల ఉత్సవానికి సంబంధించిన మూలాలు అక్కడే ఉన్నాయి. అంతేకాకుండా 'బోనాలు' అందుకునేది గ్రామీణ దేవతలే కనుక... ఇది గ్రామీణ జీవన సంస్కృతి నుంచే పుట్టింది కనుక.

## గ్రామ దేవతారాధన

ప్రపంచం మొత్తంమీద, ఆధ్యాత్మిక, భక్తి, ఆరాధన, పూజ, అర్చన వంటి అన్ని రూపాల మత ప్రక్రియలు. గ్రామీణ దేవతల పూజ నుంచే మొదలయ్యాయి అని చెప్పాలి. భారతదేశం విషయానికొస్తే, ఆర్యుల ఆగమనం కన్నా ముందు సింధునదీ నాగరికత కాలంలోనే ఈ గ్రామీణ దేవతల ఆరాధన మొదలైందనే ఆధారాలు లభిస్తున్నాయి. క్రీ.పూ. 3000 సంవత్సరాల కన్నా పూర్వం నుంచే ఈ తరహా గ్రామీణ దేవతల ఆరాధన అమలులో ఉందనడానికి సింధు ప్రజలు 'అమ్మతల్లి' (Mother Goddess) పేరిట మాతృదేవతారాధనను చేయడమే నిదర్శనం.

అందుకే మానవ విశ్వాసాల పరిణామ క్రమాన్ని ఈ క్రింది దశలుగా వర్గీకరిస్తారు.

★ ఆత్మారాధన (Animism)
★ భూతారాధన (Fetishism)
★ పూర్వీకుల దేవతారాధన (Ancestral Worship)
★ జంతు ప్రాధాన్య ఆరాధన (Totemism)
★ మాతృదేవతారాధన (Mother Goddess Worship)
★ గ్రామీణ దేవతారాధన (Rural Deity Worship)
★ శిష్ట దేవతారాధన (Classical Deity Worship)





విశ్వాసం, దేవత / దేవుడు, లేదా మానవాతీత మహాశక్తికి సంబంధించిన ఆలోచన, ఆ శక్తి / దేవతను ప్రసన్నం చేసుకోవడం ద్వారా / సంతృప్తి పరచడం ద్వారా తనకు, తన జాతికి రాబోయే విపత్తులను తొలగించుకోవచ్చనే భావన ఆదిమ మానవులలో ఏర్పడడానికి కారణం, వారిలో ఉన్న 'భయమే' అని చెప్పాలి. అందుకే భయం (Fear Complex) లోంచే భగవంతుడు పుట్టాడు.

ఆర్యులు, ద్రావిడులు, అంతకన్నా ముందున్న ఆదిమజాతుల ప్రజలు ఈ ప్రపంచంలోని అన్ని మంచి చెడ్డలకి కారణం కొన్ని 'శక్తులు' అని నమ్మారు. ముఖ్యంగా వ్యాధులకి, మరణాలకి, కరువు-కాటకాలకి, దేవతలు లేదా శక్తుల ఆగ్రహమే కారణమని నమ్మారు. అందుకే ఆ కాలంలో తమ గ్రామం లేదా తెగని సంరక్షించేందుకు తమదైన ప్రత్యేక గ్రామీణ ప్రతీకలతో కూడిన దేవతని పూజించడం ఆరంభించారు.

ఇంకొంచెం లోతుగా చరిత్ర పొరలలోకి వెళితే, మానవ జాతి సామాజిక పరిణామ క్రమాన్ని ప్రభావితం చేసినవి రెండు దశలుగా చెప్పవచ్చు.

**1. ఆహార సేకరణ దశ** (Food Gathering Stage) : ఈ దశలో మానవుడు ఒంటరివాడు. సంచార జీవనం గడిపేవాడు. తనకు నిత్యం కావలిసిన ఆహారమే అతని జీవితాశయంగా ఉండేది. ప్రకృతి పరిణామాలను చూసి, వర్షం, ఉరుము, మెరుపు వంటి అంశాలను చూసి భయపడటం, ఆశ్చర్యపోవడం ఉండేది. ఇతర జంతువుల నుండి భయం ఉన్నప్పటికీ వాటిని ప్రత్యక్షంగా ఎదుర్కొనేవాడు. ఎక్కువ సార్లు వాటిని చంపి తనను కాపాడుకునేవాడు. కానీ ఈ ప్రకృతి పరిణామాలే అతనికి అర్థమయ్యేవి కావు.

**2. ఆహారోత్పత్తి దశ** (Food Production Stage) : ఈ దశలో మానవుడు తను ఉన్న చోటనే తనకు కావలసిన ఆహారాన్ని ఉత్పత్తి చేయడం ఆరంభించాడు. వ్యవసాయం ఆరంభమై, స్థిరజీవనం మొదలైంది. తనలాంటి కొందరు మానవులతో కలిసి సాముదాయిక (Group) జీవనం అంకురించింది. ఒంటరిగా ఉండటం కన్నా, సమూహంగా కలిసి ఉండటం వల్ల జంతువుల నుంచి, శత్రువుల నుంచి రక్షణ లభిస్తుందనే అవగాహన కలిగింది. అదే సమయంలో తమ సముదాయంలోని ఏకత్వాన్ని (Unity) ని ప్రదర్శించుకోవడానికి వారందరినీ కలిపి ఉంచగలిగే చిహ్నం (Symbol) వారిని రక్షించే అతీత శక్తి (Super Power) అవసరమైంది. ఈ అవసరంలోంచే ఆయా సముదాయాలకే ప్రత్యేకమైన దేవతలు, వారి పూజ మొగ్గ తొడిగింది.

ఈ సముదాయాలు తెగలుగా, జాతిగా, గ్రామాలుగా క్రమంగా రూపాంతరీకరణ చెందాక ప్రకృతి పరిణామాలను అదుపులో పెట్టగలిగే గ్రామ దేవతల పూజారాధన మొదలయింది. ఈజిప్టు, నినేవే, బాబిలోన్, సుమేరియన్, చైనీస్, సింధునదీ నాగరికత, మయన్ నాగరికతలు వెల్లడిస్తున్న సత్యాలు ఇవే. వీటి తాలుకు అవశేషాలే, కాలాలను అధిగమించి, తరాలనుదాటి ప్రస్తుతం కూడా కొనసాగుతున్నాయి. దీనికి సజీవ తార్కాణమే 'బోనాలు'!





## గ్రామ దేవతారాధన - విశిష్ట లక్షణాలు

తెలంగాణలో ప్రస్తుతం 'బోనాలు' ప్రధానంగా నగర సంస్కృతిలో భాగంగా నిర్వహించబడుతున్నప్పటికీ, మౌలికంగా ఇవి గ్రామీణ జీవన సంస్కృతి రూపాలే. దక్షిణ భారతదేశంలో ఈ గ్రామీణ దేవతల వ్యవస్థని కూలంకషంగా పరిశోధన చేసిన రైట్ రెవరెండ్ హెన్రీ వైట్ హెడ్ అనే బిషప్ 1921 ప్రాంతంలోనే "The Village Gods of South India" అనే పరిశోధనా గ్రంథాన్ని ప్రచురించాడు. ఆయన పరిశోధన ప్రకారం భారతదేశంలో గ్రామీణ దేవతలకు సంబంధించిన విశిష్ట లక్షణాలు ఈ విధంగా ఉన్నాయి.

1. గ్రామీణ దేవతారాధన- ఆర్యుల పూర్వం, ద్రవిడ సంస్కృతికి సంబంధించిన జీవన విధానం.
2. గ్రామీణ దేవతల ప్రధాన లక్ష్యం గ్రామ సంరక్షణ, అందులోనూ, మనుషుల్ని మృత్యువాతకు గురిచేసే వ్యాధులు, ప్రకృతి వైపరీత్యాల నుండి గ్రామాలను సంరక్షించడం.
3. గ్రామ దేవతలకు భిన్నమైన పూజా విధానం ఉంటుంది. వీరంతా శిష్ట దేవతలు (Classical Gods) కాదు.
4. గ్రామ దేవతల లక్ష్యం ప్రధానంగా ఆ గ్రామానికి సంబంధించి మాత్రమే ఉంటుంది. అంతేగాక, అవన్నీ అత్యంత సాధారణమైన కలరా, గత్తర, మశూచి (Smallpox), విష జ్వరాలు వంటి వాటికి సంబంధించిన అంశాలుగా ఉంటాయి.
5. గ్రామ దేవతలు ప్రధానంగా అందరూ మహిళా దేవతలే... స్త్రీ శక్తులే. ద్రవిడ సంస్కృతి ప్రతిబింబాలైన గ్రామీణ దేవతలలో స్త్రీ దేవతలే అగ్ర ప్రాధాన్యత వహిస్తారు.
6. ద్రావిడుల లక్ష్యం ఉత్పాదకత, వ్యవసాయం. అందుకే ఉత్పత్తికి ఆలవాలమైన స్త్రీ దేవతలే ద్రావిడుల ప్రధాన దేవతలుగా ఉన్నారు.
7. ద్రవిడ సంస్కృతిలోని గ్రామీణ దేవతలలో పురుష దేవతలకు అసలే స్థానం లేదనడానికి లేదు. అయితే 'పోతురాజు' పేరిట ఉండే గ్రామదేవుడు ప్రధాన దేవతలైన "ఏడుగురు అక్కాచెల్లెళ్ళ"కు సోదరుడిగా సంరక్షకుడిగా ఉంటాడు.
8. గ్రామ దేవతలను సంతృప్తి పరిచే విధానాలలో జంతు బలులు లేదా బలి విధానం ప్రధానమైనవి.
9. అలాగే ఈ గ్రామదేవతలని అర్చించే పూజారులు బ్రాహ్మణేతర కులాలకు, హిందూ సామాజిక నిర్మాణంలో నిమ్నస్థాయి వర్గాల ప్రజలకు చెందినవారై ఉంటారు. అంతేగాక, ఈ పూజా విధానంలో కూడా శాస్త్రోక్తంగా, మంత్రాలు, సంస్కృత శ్లోకాలు వంటి నిర్దిష్ట విధానాలు ఉండవు. కొన్ని గ్రామదేవతల పూజా విధానంలో అసలు మాటలు కూడా ఉండవు.

## తెలంగాణలో గ్రామదేవతారాధన - విశేషాలు

సాధారణంగా గ్రామదేవతారాధనలలో ఉండే పై 9 విశిష్ట లక్షణాలతో పాటు తెలంగాణలోని గ్రామదేవతారాధనలో మరికొన్ని ప్రత్యేకాంశాలు గోచరిస్తాయి. అవి.

1. సాధారణంగా గ్రామదేవతలకు శిష్ట సంప్రదాయాలలోలాగా గుళ్ళుండవు. ఊరి చివర, వేపచెట్టు మొదట్లో రెండు ప్రక్కలా పొడుగైన రాయిని నిలబెట్టి పైన ఓ రాయిని బోర్లిస్తారు. గూడులా ఉండే దీనిలో (ప్రాచీన Stone Hengeకి ప్రతీక ఇది) ఎదురుగా ఉన్న రాయికి సున్నం పూసి, పసుపు, కుంకుమ బొట్టు పెడ్తారు. ఇదే గ్రామ దేవతకు ప్రతీక. అయితే కాలక్రమంలో వీరికి కూడా గుళ్ళు ఏర్పడ్డాయి.
2. గ్రామదేవతలు అనుగ్రహిస్తారని, ఆగ్రహిస్తారని గ్రామీణుల నమ్మకం. గ్రామంలో మశూచి, కలరా, గత్తర, ఆటలమ్మ వంటి వ్యాధులు ప్రబలడమే వారు ఆగ్రహించారని తెలిపే సూచికలు. వీటిని "పోచమ్మ వచ్చుడు", "గత్తర వచ్చుడు" అంటారు. వీటి నివారణకు దేవతలను సంతృప్తి పరచడానికి 'కొలుపులు' నిర్వహిస్తారు.
3. గ్రామీణుల నమ్మకం ప్రకారం దేవతలకు మద్యం-మాంసం ఇష్టమైనవి. అందువల్ల జంతుబలి ఇస్తారు. అయితే తాము ఇష్టపడేవి, తమ వాడుకలో ఉండేవే దేవతలు కూడా ఇష్టపడ్తారనే నమ్మకంలోంచే ఈ సంప్రదాయం పుట్టింది.















4. గ్రామ దేవతలు అందరూ సమానమే అయినప్పటికీ, వీరిలో కూడా ప్రత్యేకీకరణ (Specialisation) ఉంటుందనేది ప్రజల విశ్వాసం. అందుకే "మైసమ్మ" పశువులను కాపాడుతుందని, "బాలమ్మ" పిల్లలను కాపాడుతుందని, "కట్ట మైసమ్మ" చెరువుల కట్టలు తెగకుండా కాపాడుతుందని నమ్మకం.

5. గ్రామదేవతల రూపలావణ్యాలలో ప్రతీకాత్మకతే ఎక్కువ. ఈ దేవతలకు లెక్కకు మించి చేతులు, తలలు ఉండవు. ఇంకా చెప్పాలంటే నిర్దిష్టమైన రూపం కూడా ఉండదు. ఆ లెక్కన గ్రామదేవతారాధన ప్రతీకాత్మక ఆరాధనే (Symbolic Worship),

6. గ్రామదేవతల పూజ విపత్తులు సంభవించినప్పుడు మాత్రమే కాదు, శుభకార్యాలకు ముందు ఏ ఆటంకాలు రాకూడదనే లక్ష్యంతో కూడా చేస్తారు. ఎవరిళ్ళలోనైనా శుభకార్యం జరిగినప్పుడు కానీ, జరగడానికి ముందుకానీ "పోచమ్మలకు చేసుడు" తెలంగాణలో సర్వసాధారణం.

7. గ్రామ దేవతల పూజలు కుటుంబపరంగా మాత్రమే కాక, ఊరుమ్మడి సమస్యల నివారణకు గ్రామమంతా కలిసి కూడా నిర్వహిస్తారు. బోనాలు అలాంటివే.

## మాతృదేవతారాధన

తెలంగాణలో జరిగే రెండు ప్రధాన పండుగలు-1. బోనాలు, 2. బతుకమ్మ, అయితే ఈ రెండు పండుగలలో పూజలు చేసేది, ఉత్సవాలలో పాల్గొనేది మహిళలే కాగా, ఈ పూజలందుకునే దేవతలు కూడా స్త్రీ దేవతలే కావడం ఓ విశేషం. ఈ రెండూ గ్రామీణ దేవతార్చన విధానంలో ఉండటం ఒక అంశమైతే, ఆదిమ కాలంలోని మాతృదేవతార్చనకు కొనసాగింపులుగా ఉండటం మరో అంశం. దీనిని బట్టి మన ప్రాంత సంస్కృతిలో స్త్రీలని, స్త్రీ శక్తులని గౌరవించే సంప్రదాయం ఆది నుంచే ఉందని స్పష్టమవుతోంది. అంతేగాక ఇక్కడి సామాజిక ఆలోచనా రీతిపై, మాతృస్వామిక సామాజిక విలువలు చూపించిన, చూపిస్తున్న ప్రభావానికి ఇవి ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. ఈ అంశాన్ని సామాజిక పరిణామ గతిలో మాతృస్వామిక సమాజాల స్థాపన, మాతృదేవతారాధన స్థాపన రూపొందిన తీరును విశ్లేషించడం ద్వారా అర్థం చేసుకోవచ్చు.

ఆదిమ కాలంలో సామాజిక జీవనం ఆరంభమైన తొలినాళ్ళలో స్త్రీ-పురుషులిరువురిలో స్త్రీలకే అగ్రస్థానం ఉండేది. మొదట్లో ఆహార సంపాదనకే పరిమితమైన దశలో ఇద్దరూ సమానభావననే కలిగి ఉన్నారు. కానీ సామాజిక జీవనం ఆరంభమయ్యాక, తమ తెగ అభివృద్ధికి కారణమైన సంతానాన్ని సృష్టించే ప్రత్యేక 'శక్తి' స్త్రీకే ఉండటం వల్ల, స్త్రీ పురుషుడికన్నా భిన్నమైన విశిష్ట స్థానాన్ని సాధించింది.

## మాతృస్వామిక సమాజాలు (Matriarchal Societies)

ఇతర జంతువుల నుంచి రక్షణకు, ప్రకృతి వైపరీత్యాల కాలంలో సంఘటిత భావనకు కావలసిన 'మానసిక బలానికి' వారి సృష్టికి మూలశక్తి స్త్రీలలోనే ఉంది అని గమనించారు కనుక, ఈ విశేషస్థానం స్త్రీలకు దక్కింది. అందుకే సామాజిక పరిణామ క్రమంలో తొలి సువ్యవస్థీకృత సమాజాలు 'మాతృస్వామిక సమాజాలు' (Matriarchal Societies) గా రూపొందాయి. కుటుంబానికి గుర్తింపు, కుటుంబ పెద్దరికం అంతా స్త్రీలకే ఆపాదించడం జరిగింది. ఆదిమ సమాజాలు, గిరిజన తెగలు అన్నీ ఈ సూత్రాలనే పాటించడం వల్ల విశ్వాసాలు, మానవతీతశక్తుల పూజ విషయంలో కూడా 'మాతృదేవతారాధనే' అనివార్యంగా ప్రధానాంశమైంది. అంటే సామాజిక నిర్మితి, దానిలోని విలువలు మతం-అభిమతపరమైన అంశాలను ప్రభావితం చేస్తాయన్న మాట.

అందుకే కుటుంబంలో స్త్రీ తన సంతానం విషయంలో ఎంతటి శ్రద్ధాసక్తులతో వారి ఆలనాపాలనా చూసుకుంటుందో, అదే స్థితిని, అతీత శక్తులకు ఆపాదించి, అలాంటి రక్షణ భావననే అతీతశక్తులనుంచి ఆశించిన ఆదిమ జాతుల ప్రజలు ఆ అతీత శక్తుల స్థానంలో స్త్రీ దేవతలని కూర్చోబెట్టి పూజించడం ఆరంభించారు. ఇలా మాతృదేవతారాధన (Mother Goddess Worship) గ్రామీణ సమాజ పరిణామంతో పాటు కొనసాగుతూ, రెండూ అవినాభావ ప్రభావంతో, పరస్పరాధారంగా సమాంతరంగా పయనించాయి.

అయితే కాలక్రమంలో, ఎప్పుడైతే, స్త్రీ తన గర్భావధి కాలంలోనూ, సంతాన రక్షణ విషయంలోనూ పురుషుడి సహకారాన్ని తీసుకుంటూ, ఆహార విషయంలో పురుషుడిపై ఆధారపడే స్థితికి చేరుకుందో, అప్పటి నుంచే సమాజంలో పురుష స్వామ్య (Patriarchal trends) ధోరణులు పొడసూపాయి. దీనికి తగినట్లే, మతం- అభిమతం- విశ్వాసాల విషయంలో మార్పులు చోటు చేసుకుని స్త్రీ దేవతారాధన స్థానంలో పురుష దేవతారాధన ప్రారంభమైంది. ఇక మాతృస్వామిక సమాజ విధానాన్ని అవలంబించిన ద్రవిడ సమాజాలపై, పురుషస్వామ్య విధానాన్ని పాటించిన ఆర్య సమాజాలు విజయం సాధించిన తర్వాత ఈ మార్పు మరింత ప్రస్ఫుటంగా గోచరించింది. ఆ తర్వాత మాతృదేవతారాధన పూర్తిగా వెనక్కి నెట్టివేయబడింది.

ఇలా మనదేశ సామాజిక పరిణామంలో శిష్ట (elite) సామాజిక నేపథ్యంలో "మార్గ సంప్రదాయరీతి", గ్రామీణ సామాజిక నేపథ్యంలో "దేశి సంప్రదాయరీతి"లో రూపొంది, రెండూ తమ అస్తిత్వాన్ని, ఉనికిని చాటుకుంటూ వస్తున్నాయి. పురుష సామ్య భావజాలానికి పట్టం కట్టిన "మార్గ సంప్రదాయరీతి" ఎల్లెడలా ఆమోదాన్ని సాధించినప్పటికీ, మాతృస్వామ్య భావనలే పునాదిగా ఉన్న "దేశి సంప్రదాయరీతి" కూడా తన ఉనికిని కొనసాగిస్తూ వచ్చి. మాతృదేవతారాధనకి, దేశి విశ్వాసాలకి, గ్రామీణ జీవనశైలికి పట్టం కట్టిన 'బోనాలు' నేటికీ కొనసాగడమే ఈ మాటలకి సాక్ష్యం,

## భారతదేశంలో గ్రామదేవతలు

ఉత్తరాదిలో గ్రామదేవతల గాథలు, పూజలు ఆచరణలో ఉన్నాయి. దేవతలుగా అక్కాచెల్లెళ్ళను గ్రామ దేవతలుగా ఆరాధించే సంప్రదాయం ఇప్పటికీ వాడుకలో ఉంది. వారు : 1. సీతాల 2. కంకర్ మాత 3. పాన్ సహిమాత, 4.పూల్మాత 5.బడీమాత, 6. గుల్సాలీమాత 7. బసంతిమాత

అలాగే బెంగాల్ లో కూడా ఈ గ్రామదేవతల పూజ ప్రచారంలో ఉంది 'బూర్వాబుర్వి', 'పంచనంద', 'జమైశాస్త్రి', 'సిద్ధేశ్వరి', 'విద్దేశ్వరి' వంటి గ్రామదేవతలు అక్కడ ప్రసిద్ధి.

ఈ తరహా గ్రామదేవతల గురించి నమ్మకాలు దక్షిణాదిలో తమిళనాడు, కర్ణాటక ప్రాంతంలో కూడా విస్తృతంగా వ్యాప్తిలో ఉన్నాయి. తమిళ ప్రాంతంలో ఈ ఏడుగురు అక్కా చెల్లెళ్ళను "సప్తకన్నెగై" అనీ, "ఆకాశ కన్నిగై" అనీ పిలుస్తారు. కొలుస్తారు. దీన్ని బట్టి దక్షిణ భారతదేశంలోని అన్ని ప్రాంతాల ప్రజల విశ్వాసాలకు పునాదులు ద్రవిడ సంస్కృతిలో ఉన్నాయనే విషయం మరోసారి తేట తెల్లమవుతుంది.

తెలంగాణలో గ్రామదేవతలుగా పూజలందుకొంటున్న దేవతలు మొత్తం ఏడుగురని, వారందరూ అక్కా చెల్లెళ్ళనే గాథ వాడుకలో ఉన్నాయి. ఆ ఏడుగురు గ్రామదేవతలలో 1). పోచమ్మ, 2). మైసమ్మ, 3). బాలమ్మ, 4). ఎల్లమ్మ, 5). ముత్యాలమ్మ, 6). మహంకాళమ్మ, 7). పెద్దమ్మ పేర్లతో ప్రచారంలో ఉన్నారు. వీరి సోదరుడిగా పోతురాజు వీరికి రక్షణగా ముందుంటాడని విశ్వాసం.

## ఏడుగురు అక్కాచెల్లెళ్ళ పురాగాథ - క్రీడాభిరామం


ఇక, ఈ ఏడుగురు అక్కా చెల్లెళ్ళకు సంబంధించిన గాథలు ఎన్నో వాడుకలో, ప్రజల వ్యవహారంలో ఉన్నప్పటికీ, సాహితీరూపంలోని పురాణగాథలు కొన్ని ఉదహరించదగ్గవి ఉన్నాయి. వాటిలో వినుకొండ వల్లభారాయుడు రాసిన "క్రీడాభిరామం" గ్రంథంలోని ప్రస్తావన ప్రముఖమైందిగా కనిపిస్తుంది.

దాదాపు 600 సంవత్సరాలు క్రితం నాటి ఈ గ్రంథంలో ఈ ఏడుగురు అక్కా చెల్లెళ్ళ ప్రస్తావన ఈ క్రింది పద్యంలో కనిపిస్తుంది.

"హరహర యంత మొప్పునే మహార భటిక జగఝుంకృత్యన<br>
న్మరళి నిమి శ్రితాంక రవ మూర్ఛలంజిత్తములుచ్చి యక్కలే<br>
డ్వరు నదె యాడం జొచ్చిరి కడుంగడు వేడ్కె సమున్నమత్యయో<br>
ధరర యుగ భార భీరు తమ తన్వవలగ్నములైన నృత్యముల్"







పై పద్యంలో, ఏడుగురు అక్కాచెల్లెళ్ళు పెద్ద చప్పుడుతో, వేణువు శబ్దం వింటూ మధ్య మధ్యలో మూర్ఛపోతూ, మనసులు ఉత్తేజం పొంది ఏడుగురు అక్కాచెల్లెళ్లు నర్తించడం ఆరంభించారని వర్ణించారు. ఈ పద్యం గ్రామదేవతల పూజావిధానానికి సంబంధించిందిగా, ఏడుగురు గ్రామదేవతలకి ప్రతినిధులుగా ఏడుగురు స్త్రీలను అలరించి చేసిన పూజగా తెలియవస్తోంది.

కాగా, ఇదే గ్రంథంలో ప్రస్తావించబడిన "కామేశ్వరి కథ" ఏడుగురు గ్రామదేవతల పుట్టుకకు సంబంధించిన వివరణను ఇస్తుంది. సంక్షిప్తంగా ఈ పురాగాథ ఇలా ఉంటుంది.

"రామావతరంలో ఉన్న విష్ణువుని చూసి లక్ష్మీదేవి మోహిస్తుంది. అయితే ఈ అవతారంలో తాను ఏకపత్నీవ్రతుడనని తిరస్కరించి, మరుజన్మలో ఆమె కోరిక తీరుస్తానంటాడు. లక్ష్మీదేవి శివున్ని ఆశ్రయించి తనను కుమార్తెగా అనుగ్రహించమని విన్నవించితే, శివుడు తనకింకా గౌరీదేవితో వివాహం జరగలేదని, అంతదాకా ప్రక్కనే ఉండే కొలనులో ఉండవలసిందని కోరతాడు. ఆ తర్వాత గౌరీదేవిని వివాహమాడి, ఆ కొలనులో జలక్రీడలాడుతున్నప్పుడు, గౌరీదేవికి దప్పికవేసి ఏడుదోసిళ్ళ నీళ్ళను తాగుతుంది. దానివల్ల లక్ష్మీదేవి ఏడుగురు కన్యలుగా సద్యోగర్భాన పుడుతుంది. గౌరీదేవికి పెడతలలో పెరవాణి, శిరస్సులో శివమణి, కొప్పులో కొండవాణి, ముఖంలో ముద్దరాలు, స్తనాల్లో జక్కులమ్మ, కన్నుల్లో కామేశ్వరి జన్మిస్తారు. వీరికి కాపలాగా పోతురాజును సృష్టించి గౌరీశంకరులు వెళ్ళిపోతారు. ఒకసారి బ్రహ్మదేవుడు ఆ కొలను దగ్గరకొచ్చి, వారి పోషణార్థం 'దాదెమ్మ', పోతురాజుకు భార్యగా 'కూనలమ్మ'ను సృష్టిస్తాడు."

ఏది ఏమైనా ఈ పురాగాథ మాతృస్వామిక సామాజిక వ్యవస్థలో పుట్టిన గ్రామదేవతలను, స్త్రీ దేవతారాధన భావనను తెలివిగా పురుషదేవతలకు 'దాసోహం' సరెండర్ చేసే ప్రయత్నం చేసిందనే విషయం తెలుస్తోంది. అలాగే ద్రావిడ సంస్కృతిపైన ఆర్య సంస్కృతి ఆధిపత్యాన్ని నిరూపించే యత్నం చేసిందని కూడా వెల్లడవుతోంది.

అయితే, ఇలాంటి వివరణలని ప్రాచీన తెలంగాణా సాహిత్యంలో 'బోనాల' గురించిన వర్ణనలలో కొట్టి పారేయడమే కాక, పూర్తిగా పురుష దేవతల ఆధిపత్యాల నిమిత్తం లేని గ్రామదేవతల ఆవిర్భావాన్ని వివరించారని తెలుస్తోంది.

## బోనాలు - సాహితీ ప్రస్తావన

బోనాల సంస్కృతి పురాగాథలుగా జనం నాల్కల మీద నడయాడడమే కాకుండా, వివిధ గ్రంథాలలోనూ, సాహిత్యంలోనూ, ప్రస్తావించబడింది. అచ్చ తెనుగు భాషలో కావ్యరచన చేసిన పాల్కురికి సోమనాథుడు తన రచనలైన 'పండితారాధ్య చరిత్ర', 'బసవ పురాణం' గ్రంథాలలో కొన్ని చోట్ల బోనాల ఉత్సవం గురించిన ప్రస్తావనని చేసారు. దీన్ని బట్టి గ్రామ దేవతలను, స్త్రీలను శక్తి రూపాలుగా ఆరాధించే విధానం 12వ శతాబ్ద కాలం నాటికే తెలంగాణ ప్రాంతంలో వ్యాప్తిలో ఉందని తెలుస్తోంది.

అలాగే 12-13వ శతాబ్దికి చెందిన జాయపసేనాని తన 'నృత్య రత్నావళి' గ్రంథంలో బోనాల జాతరలో చేసే జానపదుల నృత్య విన్యాసాలను గురించి ప్రస్తుతించాడని తెలుస్తోంది. దీన్ని బట్టి కాకతీయుల కాలంలో గ్రామదేవతలు తమదైన ప్రత్యేక ముద్రతో ప్రజాబాహుళ్యంలో పూజలందుకొన్నారని అర్థమవుతోంది. ఇంకా చెప్పాలంటే కాకతీయ వంశ ఆవిర్భావమే 'కాకతమ్మ' అనే దేవత కృపతో జరిగిందని, వీరు శైవులుగా మారడానికి ముందు 'కాకతి' అనే గ్రామదేవతనే పూజించేవారిని, ఈ వంశమూల పురుషుడైన గుండనకు 'కాకర్త్య గుండన' అనే పేరు అందుకే వచ్చిందని కూడా కథనాలున్నాయి. అలాగే ఆ కాలంలో రాణి రుద్రమ దేవి ప్రతిరోజూ తన ఇష్టదైమైన 'ఏకవీర' దేవాలయాన్ని సందర్శించేదని, అందులో కొలువైన 'కాకతమ్మ'ను పూజించేదని తెలుస్తోంది.





(ఈ దేవాలయం ప్రస్తుతం వరంగతకు చేరువలోని 'మొగిలిచెర్ల' గ్రామంలో ఉంది. ఈ కథనాలు వెల్లడి చేస్తున్న మరో అంశం ఏమిటంటే, కాకతీయుల కాలంలో "మాతృదేవతారాధన" ఉన్నతస్థితిలో ఉన్నట్టు అర్థమౌతుంది.

అలాగే 'హంసవింశతి' కావ్యంలోని ఓ పద్యపాదంలో బోనాల గురించిన ప్రస్తావన ఈ విధంగా ఉంది.

"ఆ గంగకున్, వెలయన్ వేటలు

బోనముల్ సిరులు గావించెన్ సుతోత్పత్తికై" (హంసవింశతి 2:91)

ఈ పద్యపాదంలో, కొడుకు పుట్టాలని గంగమ్మకు బోనాలు సమర్పించారని తెలుస్తోంది.

## బోనం - పదవిశేషం

సాధారణార్థంలో 'బోనం' అనే పదానికి భోజనం అని చెప్పవచ్చు. అయితే ఈ భోజనం ఎవరికి, ఎందుకోసం, ఏ విధంగా ఇతర భోజనాల కన్నా ప్రత్యేకం అనే అంశాలలోంచే 'బోనం' విశిష్టమైందిగా కనిపిస్తుంది. ఆ లెక్కన ఈ బోనం దేవతల కోసం, దేవతలకు ఆహారాన్ని అందించి సంతృప్తి పరచడం కోసం, ఉద్దేశించబడింది అని చెప్పవచ్చు. దేవతల ఆహారం కనుక ప్రత్యేకంగా, పవిత్రంగా తయారుచేయడం ద్వారా ఇతర భోజనాల కన్నా విశిష్టమైనది అనే గూఢార్థాలని నిబిడీకృతం చేసుకొని ఈ పదం ఉందని భావించాలి.

అలాగే ఈ 'బోనం' అనే మూలపదానికి (Root word) బోనాలు, బోనకుడు, బోనకత్తె, బోనము అనే ఇతర పదాలు ఉత్పాదకాలు (Derivatives)గా వాడుకలో ఉన్నాయి. వీటర్థం- అన్నం. అన్నం (వంట) చేసేవారు. వంటపాత్ర అని చెప్పవచ్చు. అలాగే భుక్తి, తినుడు, అనే క్రియాత్మక అర్థాలు కూడా ఉన్నాయి.

ఇక్కడ ఆసక్తికొలిపే అంశం ఏమిటంటే-బోనం ప్రక్రియ మాత్రమే కాదు. బోనం అనే పదం కూడా నూటికి నూరుపాళ్ళు గ్రామీణ, జానపద, గ్రామ్య సంప్రదాయాన్ని వ్యక్తం చేస్తున్నదని చెప్పాలి. 'భోజనం' అనే పదం శిష్ట భాషలో (Elite or Classial Language) చెప్పేదిగా ఉండగా, బోనం అనేది గ్రామీణ జనాల వాడుకలో ఉన్న పదంగా ఉంది.

## బోనం- అంతరార్థం - తాత్విక సందేశం

'బోనం' భాషాపరంగా నే కాకుండా ప్రక్రియాపరంగా మరో అంతరార్థాన్ని, జీవన తాత్వికతని చెప్పకనే చెప్పినట్లుగా ఉంటుంది. దీని ప్రకారం, 'భువనం' అనే శిష్ట పదానికి కూడా వికృతి 'బోనం'! పురాణ కాలంలో ఆదిశక్తి భువన భారాన్ని మోసింది. ఈనాడు ఆదిశక్తి ప్రతిరూపం అయిన స్త్రీ, మన దేహానికి ప్రతీక అయిన కుండని మోస్తున్నది. బోనంపైన ఉన్న దీపం పరమాత్ముడికి, బోనం కుండకు రంధ్రాలు చేసి లోన పెట్టిన దీపం మనలోని ఆత్మకి సంకేతంగా ఉంటోంది. అందుకే మన గ్రామీణ సంప్రదాయంలో దేహాన్ని కుండతో పోల్చడం వాడుకలో ఉంది.

అలాగే 'బోనం'లో ప్రతీకాత్మక సందేశం కూడా ఇమిడి ఉంది. మట్టి కుండ ఈ లోకంలోని భూమికి ప్రతీక (ఆకారంలో కూడా సామ్యత ఉంది). అందులోని పదార్థాలు నీరు, అగ్ని (దీపం) వంటివి పంచభూతాలకు ప్రతీకలు. పంచభూతాత్మకమైన ప్రపంచ భావనని పామరులకు సైతం అవగాహన కలిగించడానికే ఈ భౌతిక వస్తువుల (Physical Motifs) ను ప్రతీకగా వాడారేమోననిపిస్తుంది.

## బోనాలు - పరిణామం

సంప్రదాయానికి, నిర్దిష్ట విధి విధానాల చట్రానికి అతీతంగా ఉండే మాతృదేవతారాధన, గ్రామీణ దేవతారాధన లోంచి పుట్టిన 'బోనాలు' క్రమ క్రమంగా సంప్రదాయంగా ఏర్పడటం ఓ విశేషం. ఈ పరిణాను క్రమంలో హైదరాబాద్ జంటనగరాలలో శతాబ్దాల కాలం నుంచి జరుగుతున్న ఈ బోనాల పండుగ మరెన్నో సామాజిక, నిర్మాణాత్మక పరిణామాలను కూడా చెప్పకనే చెపుతోంది. వాటన్నిటికీ సాక్షిగా నిలుస్తోంది.

1. మొదట్లో పల్లెలకు, గ్రామాలకు సంబంధించిన ఉత్సవ విశేషంగా బోనాల పండుగ ఉండేది. కానీ హైదరాబాద్ నగరం



JIYO AUR JEENEDO JAAN
sagas



విస్తరించి మహానగరంగా ఎదిగిన తర్వాత కూడా, ఆధునికత, పాశ్చాత్య జీవన విధానాలన్నీ నగరంలోకి చొచ్చుకువచ్చిన తర్వాత కూడా ఈ అనాదికాలపు గ్రామీణ జీవన సంస్కృతికి ఇంత ఆదరణ, ఆచరణ ఉండటం భారతీయ జీవన విధానంలోని వైవిధ్యతకు, తెలంగాణ ప్రజలలో ఉండే "మట్టి- మానవ సంబంధాల పరస్పర ప్రభావానికి" అచ్చమైన ఉదాహరణలుగా చెప్పాలి.

2. సామాజిక పరిణామ క్రమంలో నగరీకరణ (Urbanisation), సంస్కృతీకరణ (Samskritisation of Cultures) అత్యంత సహజం. నగరీకరణ వల్ల ఆధునిక సాంకేతిక సౌకర్యాలు జన బాహుళ్యంలోకి వస్తాయి. సంస్కృతీకరణ వల్ల కొత్త సంప్రదాయాలు, ఇతర ప్రాంతాల ఆచారాల పరిచయం ఏర్పడుతుంది. దీనివల్ల మూల సంస్కృతులు (Native Cultures) కొంతవరకు కనుమరుగు కావడం, అవశేషంగా మిగిలిపోవడం, కేవలం "మ్యూజియంలో వస్తువు"గా మారడం కూడా సహజం. కానీ ఇలాంటి ఆటుపోట్లకు, కాలపరీక్ష (Test of Time) కు నిలిచి, నేటికీ నగరంలో జనం గుండెల్లో 'బోనాల పతాకం' ఎగురుతున్నదంటే, మూలాలను విస్మరించని తనమేదో మన జన్యువులలో ఇంకా ఉండడమే కారణమని భావించాలి.

3. ఆమాటకొస్తే భారతీయ ఆత్మలోనే ఈ సమ్మేళిత (Assimilation) భావన, సమ్మేళిత స్పందన ఉన్నాయి. అందుకే వేలాది ఏళ్ళ నుంచి ఎన్ని రకాల సంస్కృతులు మనదేశంలోకి వచ్చినా, వాటిని ఆహ్వానించగలిగింది. అదే సమయంలో తనదైన సొంతతనాన్ని కూడా కాపాడుకుంది.

4. బోనాల ఉత్సవం మొత్తం నగరాన్ని ఒక్కసారిగా మనకట్టు, మనబొట్టులతో సౌందర్యవంతం చేస్తుంది. చదువు, స్థాయి, హోదా, ఉద్యోగం వంటి సామాజిక, ఆర్థిక కారకాలతో నిమిత్తం లేకుండా అందరూ, ముఖ్యంగా మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో సంప్రదాయ వస్త్రధారణతో, అలంకరణలతో బోనాలను తలపై మోస్తూ అమ్మవారికి సమర్పిస్తారు..

5. వందలాది సంవత్సరాల ఆచారంలో బోనం ఎత్తుకెళ్ళే పాత్ర "మట్టికుండల" నుండి "స్టీలు / ఇత్తడి పాత్ర"లకు మారింది. సహజమైన గ్రామీణత నుండి, తెచ్చి పెట్టుకున్న నగర సొగసులలోని కృత్రిమత అనివార్యంగా ఎగబాకింది. బోనం పాత్రని బట్టి ఆర్థిక స్థాయిల ప్రదర్శన (Exhibitionism) వచ్చింది.

6. భౌతికపరమైన రూప ప్రదర్శనలలో మార్పులెన్నో ప్రస్తుతం పొడసూపాయి. ఇవన్నీ భక్తుల పరంగా వచ్చిన మార్పులు, సౌలభ్యాలు మాత్రమే, కానీ బోనాల ప్రక్రియకు అసలైన రూపానిచ్చే శివసత్తులు, పోతురాజులు, వేపరెమ్మల ఆలంకరణలు, పసుపు-కుంకుమల బొట్లతో "పూదించడాలు" మాత్రం ఇప్పటికీ అదే సహజత్వాన్ని కలిగి ఉన్నాయి.

7. బోనాల పండుగ నిరంతరం గుర్తు చేసే మరో సత్యం ఏమిటంటే నేటి నగరం నిన్నటి గ్రామం పునాదుల మీదనే ఉద్భవించిందనేది. గ్రామాలు పెద్ద గ్రామాలుగా, అవి పట్టణాలుగా, నగరాలుగా రూపాంతరం (Metamorphosis) చెందుతున్న తీరుకు అద్దం పడుతూనే బోనాల పండుగ సమయంలో తన పునాదులలోకి విస్తరించడం మనకు కనిపిస్తుంది ఏటా వచ్చే బోనాలు చెట్టు వేళ్ళలోకి మనం తొంగి చూసేలా చేస్తున్నాయి. మనల్ని మూలాలు మరవకుండా నిత్య జాగృతం చేస్తున్నాయి.

8. ప్రస్తుతం బోనాలు ఆషాఢమాసం నెల రోజులపాటు హైదరాబాద్- సికింద్రాబాద్ జంటనగరాలలో పెద్ద ఎత్తున జరుగుతున్నప్పటికీ, ఈ ఉత్సవం కేవలం నగరానికే పరిమితం కాదు. తెలంగాణ జిల్లాలలోని గ్రామ గ్రామాన, పల్లె పల్లెన ఈ బోనాల ఉత్సవాన్ని అన్ని వర్గాల ప్రజలు కుటుంబ పరంగా "ఎల్లమ్మకు పెట్టుడు" అనే పేరుతో చేస్తున్నారు.

9. సాధారణంగా భారతీయ పండుగలన్నీ గ్రామ ఆధారిత పండుగలే! వ్యవసాయం, రుతువులమార్పు వంటి ప్రాకృతిక అంశాల సూచికగా నిర్వహిస్తున్నవే!. అందువల్ల ప్రతీపండుగ గ్రామ కేంద్రంగానే జరుగుతుంది. నగరాలలోకి ఉద్యోగ-ఉపాధి నిమిత్తం వలస వెళ్ళిన వారందరూ ఈ పండుగల సందర్భంలో మళ్ళీ పల్లెలలోకి, గ్రామాలలోకి తిరిగి రావడం జరుగుతుంది. కానీ, తెలంగాణలోని జంటనగరాలలో మాత్రమే నిర్వహించే ఈ 'బోనాల జాతర'కి ఎక్కడెక్కడి గ్రామాలలోనో ఉండే ప్రజలందరూ నగరానికి వస్తారు. మిగతా పండుగలన్నింటికీ భిన్నంగా 'బోనాల జాతర' గ్రామీణ ప్రజలని సైతం నగరానికి రప్పిస్తుంది.


ASSEMBLY


FAMILY
VEG
ASHIRVAD TIFFANS
ఆశీర్వాద్ టిఫిన్స్ వెజ్



# బోనాలు - దశలు - నిర్వహణా ప్రక్రియ

ఆదిమకాలంలో బోనాల జాతరకు నిర్దిష్టమైన ప్రక్రియ కానీ, విధి విధానాలు కానీ లేవు. కానీ కాలక్రమేణా కొన్ని ఆనవాయితీగా, సంప్రదాయంగా రూపొందాయి. వాటిని అనుసరించి ఈ బోనాల నిర్వహణా క్రమమును ఈ క్రింది దశలుగా చెప్పవచ్చు.

**1. బోనం తయారీ దశ :** దీనిలో కుండని అలంకరించడం, పప్పు బెల్లం, బియ్యంతో పాశం వండటం, పసుపు కుంకుమ బొట్లు పెట్టడం, వేప రెమ్మలను కట్టడం ఉంటాయి. పైన దీపం తప్పని సరి.

**2. ఊరేగింపు దశ :** దీనిలో ఘటంతో స్వాగతం, శోభాయాత్ర, తొట్టెల ఊరేగింపు, పోతురాజుల వీరంగాలు, సాకపోయడం, గావు పట్టడం, అమ్మవారిని సాగనంపడం వంటివి ఉంటాయి.

**3. బోనాల సమర్పణ :** దీనిలో అమ్మవారి గుడి లేదా కొలుపు దగ్గరికి బోనాలు సమర్పించడం, మొక్కులు తీర్చుకోవడం, బోనాలను పంచడం, ఫలహారపు బండ్లను సమర్పించడం ఉంటాయి.

**4. రంగమెక్కడం :** దీనిలో- గ్రామానికి, ప్రాంతానికి, దేశానికి సంబంధించిన భవిష్యత్ వాణిని ప్రజలకు తెలియ చేయడం ఉంటుంది.

## 1. ఘటోత్సవం

**a) ఊరేగింపు:** బోనాల జాతరకు సంబంధించిన సన్నాహక చర్యలలో మొదటి ఘట్టం - ఘటోత్సవం. 'ఘటం' అంటే కుండ లేదా కలశం. ఓ కుండను చక్కగా అలంకరించి, ఆ కుండపై అమ్మవారి ఉత్సవ విగ్రహం పెట్టి, ఆ విగ్రహాన్ని కూడా అందంగా అలంకరించి, ఆ మొత్తం కుండని నెత్తిమీద పెట్టుకుని భాజా భజంత్రీలతో, డప్పు చప్పుళ్ళతో వీధి వీధిలో తిరుగుతారు. అసలైన బోనాల జాతర ఆరంభం అవడానికి ముందు రోజు వరకు పుర వీధులలో ఇలా ఉదయం సాయంత్రం ఊరేగుతారు.

దీని ఉద్దేశం, ప్రతి బజారుకు తిరిగి 'బోనాల జాతర' వచ్చిందని తెలియచెప్పడం. ఈ ఊరేగింపు లక్ష్యం- ఊరికి ఎరిగింపు చేయడం. ఇంకా చెప్పాలంటే, అమ్మవారే స్వయంగా ప్రతి వీధికి, వాడకు వచ్చి తన జాతరకు రమ్మని అందరినీ ఆహ్వానించడం అన్నమాట. అయితే ఈ సంప్రదాయం, ప్రస్తుతం కేవలం జాతరకు ముందు ఒక్కరోజుకు మాత్రమే పరిమితం చేయబడింది.

**b) ఎదుర్కోలు:** ఊరేగుతున్న అమ్మవారికి ఎదురెళ్ళి, పట్టువస్త్రాలు, పసుపు-కుంకుమ, పండ్లు - పూలతో పూజించి ఆలయానికి తీసుకొస్తారు. ఈ 'ఎదుర్కోలు' యాత్ర వెనుక, అమ్మవారిని ఆడబిడ్డగా భావించి తన అత్తింటికి గౌరవంగా తోలుకొని రావడం అనే అనాది నమ్మకం కారణం.

ఇలా తోలుకొచ్చిన ఘటాన్ని ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థానంలో ప్రతిష్ఠాపన చేస్తారు.

## 2. బోనం కుండ

సాధారణంగా బోనాల జాతరను హైదరాబాద్-సికింద్రాబాద్ నగరాల్లో ఆషాడ మాసంలోనే నిర్వహిస్తారు. కానీ తెలంగాణలోని జిల్లాల్లో, గ్రామాలలో శ్రావణమాసంలో కూడా నిర్వహిస్తారు. అయితే బోనాల జాతరకు సన్నాహక చర్యలు 'బోనం కుండ' తయారీ నుంచే ఆరంభమవుతాయని చెప్పవచ్చు. బోనాల జాతర కాలం (ఆషాఢమాసం ఆరంభం) కన్నా ముందే కుమ్మరి, మట్టితో చేసిన పచ్చికుండను (అక్కడక్కడ రంధ్రాలు చేసి) తయారుచేసి దానిన కాల్చి తయారుగా ఉంచుతారు.

అలా తయారైన కొత్త కుండని తీసుకొచ్చి నిండుగా పసుపు పూసి, కుంకుమతో బొట్లు పెడతారు. కుండ మీద "ముంత"ని, ముంతమీద "కంచుడు" పెడతారు. దీని కింద నుండి బయటకు వ్రేళ్ళాడే విధంగా వేప రెమ్మలను దారంతో కడతారు. రంధ్రాలున్న కుండలో దీపం పెట్టి, ముంతలో గానీ, మరో కుండలో కానీ 'బోనం'ను పెడతారు.

ఈ 'బోనం'ను బియ్యం, పసుపు, పాలు, బెల్లం వేసి వండుతారు. ఇదే అమ్మవారికి భక్తులు సమర్పించే నైవేద్యం'. అయితే ఈ సంప్రదాయం కాల క్రమంలో చాలా మార్పులను సంతరించుకుంది. అంతటా కుమ్మరులు తయారుచేసే మట్టి కుండలు దొరకని కారణం వల్ల, కొన్ని సందర్భాలలో కుండలు ఊరేగింపు చేస్తున్నప్పుడు తలలపైనే పగిల్చిన కారణం వల్లలో





మట్టి కుండ స్థానంలో ప్రస్తుతం రాగి, స్టీల్ బిందెలు వచ్చి చేరాయి. అంతేకాక, ఆయా ప్రజల ఆర్థిక, సామాజిక స్థితికి అద్దం పట్టే 'స్టేటస్ సింబల్'గా ఇప్పుడు ఇది మారింది. కొందరు ఈ కుండకి బదులుగా ఇత్తడి, బంగారు పూత లేదా బంగారంతో చేసిన బిందెలని వాడటం కూడా ఆచరణలోకి వచ్చింది.

## 3. శోభాయాత్ర

భక్తులు ముఖ్యంగా మహిళలు నియమ నిష్టలతో పసుపు-కుంకుమ, పట్టు వస్త్రాలతో అలంకరించుకుని, ఇంటి నుంచి అమ్మవారి ఆలయానికి బయలుదేరుతారు. ఈ శోభాయాత్రలో వీరు ప్రధానంగా మూడు రకాల సమర్పణలు చేస్తారు.

**(ఎ) బోనం కుండలు (అన్నం ఉన్నవి)**

**(బి) బోనాలు (దీపాలున్నవి)**

**(సి) తొట్టెలు**

ఇంటి నుండి మొదలయ్యేది ఒక్కరే అయినప్పటికీ అమ్మవారి గుడి చేరేసరికి వేలాది మందిగా మారి ఈ శోభాయాత్ర శోభాయమానం అవుతుంది.

## 4. సాక సమర్పణ

'సాక పోయడం' అంటే 'శాఖలు' (వేపకొమ్మలు) సమర్పించడం అని చెపుతారు. ఇంటి దగ్గర నుంచి తెచ్చిన బోనాలను అమ్మవారి గుడి దగ్గర 'సాకపోయడం'తో బోనాల సమర్పణ ఆరంభం అవుతుంది. గుడి ముందు పసుపు నీళ్ళతో వేపాకును కలిపి సమర్పిస్తారు. లేదా గుడి ముందు పోతరాజు దగ్గర కానీ, బొడ్రాయి దగ్గర కానీ ఈ సాకపోస్తరు.

ఈ సాకపోసే ప్రక్రియ ఆయా కాలాలలో ఎన్నెన్నో రూపాంతరాలు చెందుతూ వచ్చింది. మొదట్లో ఈ సాకపోయడానికి తాటికల్లును (అమ్మవారికి ఇష్టమని) సమర్పించేవారు. ఆ తర్వాత సారాని, ఇప్పుడు అది బీరు, బ్రాందీల వరకు రూపాంతరం చెందిందని తెలుస్తోంది. అలాగే, ఈ మత్తుపదార్థం వద్దనుకున్నవారు బెల్లం పానకంను సాకపోస్తారు. దీనికి తోడు కొబ్బరికాయలు కొట్టి ఈ నీళ్ళని కూడా సాకపోస్తరు.

## 5. ఫలహారపు బండ్లు

బోనం సంప్రదాయంలోని మూలాంశమే ఆహారాన్ని సమర్పించడం ద్వారా దేవతలని సంతృప్తి పరచడం, ప్రసన్నం చేసుకోవడం అయితే ఈ 'బోనం' సమర్పణ ఆయా భక్తుల స్థాయిని బట్టి, మొక్కులను బట్టి ఉంటుంది. సాధారణంగా బోనంకుండలో తెచ్చిన ఆహార సమర్పణ ఒకటైతే, భారీ ఎత్తున ఆహారాన్ని బండ్లల్లో తీసుకువచ్చి సమర్పించడం మరొకటి.

ఇలా భక్తులు అమ్మవారికి ఇష్టమైన పదార్థాలను తమ తమ ఇండ్లలో తయారుచేసుకుని, వాటిని ప్రత్యేకంగా అలంకరించిన బండ్లలో పెట్టుకుని వచ్చి, గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి కొంత సమర్పించి, మిగిలినవి ఇంటికి తీస్కెళ్ళి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి దాన్ని 'మహాప్రసాదం'గా

పంచుకొని స్వీకరిస్తారు.

ఈ ఫలహారపు బండ్లను మొదట్లో ఎడ్ల బండ్లమీద ఊరేగింపుగా తీసుకొచ్చేవారు. కానీ ప్రస్తుతం ఎడ్లబండ్లు కనుమరుగు కావడం, రహదారులు ఇరుకుగా ఉండటం వంటి కారణాల వల్ల వీటి స్థానంలో 'మేకలు లేదా గొర్రెలు తోలే ఫలహారం రథాలు' ఇప్పుడు వాడుకలోకి వచ్చాయి. 'బండ్లు' కాస్తా 'రథాలు'గా మారి అందమైన అలంకరణతో ఆకర్షణీయంగా మారాయి.

## 6. బలి తీయడం

మనుషులు కడుపునిండా అన్నంతిని ఏ విధంగా సంతృప్తి చెందుతారో, దేవతలు కూడా భోజనం ద్వారానే సంతృప్తి చెందుతారనే సాధారణ ఆదిమ ఆలోచన (Primitive Thought) 'బోనాల'కు అంకురార్పణ చేసిందనేది అందరూ అంగీకరించేదే. అయితే అమ్మవారి కోసమే ప్రత్యేకంగా ఓ జీవిని బలి ఇవ్వడం ద్వారా దేవతలు మరింత సంతృప్తి చెందుతారనుకోవడం నుంచి ఈ 'బలి తీయడం' అనే సంప్రదాయం బోనాలలో మొదలైందని చెప్పవచ్చు.

గుడి దగ్గర, అమ్మవారి విగ్రహ ప్రాంగణంలో ఈ విధంగా జంతుబలిని ఇవ్వడం మొదలైంది. మొదట్లో దున్నపోతులు బలి జీవులుగా ఉండగా, ఆ తర్వాత గొర్రెలు, మేకలు, కోళ్ళు ఆ స్థానంలోకి వచ్చాయి. ప్రభుత్వం, ఇతర సంఘాల కృషి వల్ల ప్రస్తుతం జంతుబలి నిషేధమై, గుమ్మడికాయలు, అనపకాయలు మాత్రమే ఇపుడు బలి వస్తువులుగా ఉన్నాయి.

ఇలా బలితీసిన జంతువుల మాంసాన్ని వండుకుని ఆహారంగా, 'ప్రసాదం'గా భుజించడం ఆచరణలో ఉంది.

## 7. తొట్టెల ఊరేగింపు

తమ పిల్లా జెల్లా, కుటుంబం, గ్రామం అంతా బాగుండాలనే 'వాంఛ' లోంచే అసలు బోనాల జాతర పుట్టింది. ఆ కోర్కెలను తీర్చేందుకు భక్తులు సమర్పించే అంశాలలో బోనం, ఫలహారపు బండ్లు, బలి తీయడం అనేవి ఆహారానికి సంబంధించినవి అయితే ఆహారేతరమైన సమర్పణలలో ప్రముఖమైంది. 'తొట్టెల సమర్పణ'.

ఆదిమ కాలంలో స్త్రీ దేవతల ఆరాధనకు ప్రాథమిక లక్ష్యం- సంతాన సాధన, వంశాభివృద్ధి. సంతానాభివృద్ధి చేయగల శక్తి స్త్రీలకుందని ఆదిమ జాతుల ప్రజలు గమనించారు కనుకే సంతాన సాధనకోసం స్త్రీ దేవతలను పూజించడం ద్వారా వారిని సంతృప్తిపరిచే ప్రక్రియలని ప్రారంభించారు. ఈ ప్రాథమిక అవసరం 'బోనాల జాతర'లో తొట్టెల సమర్పణగా మారింది. ఎందుకంటే, సాధారణంగా సంతానం కలగని దంపతులు, స్త్రీ- పురుషులే ఈ తొట్టెల ఊరేగింపును నిర్వహిస్తారు.




ంకాళి జాతర ఉత్సవాలు





అయితే ఈ తొట్టెలను రంగు రంగుల మెరిసే కాగితాలతో అంతస్థులు, అంతస్థులుగా నిర్మిస్తారు. ఇవి 3, 4, 5, 6, 7 అంతస్థుల వరకు ఉంటాయి. వెదురు లేదా కర్రలతో నిర్మించిన ఈ తొట్టెలను మెరిసే కాగితాలతో పాటు, రకరకాల పూలతో కూడా అలంకరించి మగవారు వీటిని మోస్తూ గుడికి తీసుకువస్తారు. స్త్రీలు వారిని వెంబడిస్తారు. పిల్లలు కానివారు సంతానం కోసం, సంతానాన్ని పొందిన వారు మొక్కు తీర్చుకోవడం కోసం వీటిని ఊరేగిస్తారు. ఇలా తీసుకొచ్చిన తొట్టెలను గుడికి కానీ, గుడి దగ్గర చెట్టుకి గాని, గుంజకు కానీ, రాతి స్థంభానికి కానీ కట్టి దండం పెట్టి వెళ్ళిపోతారు.

## 8. పోతురాజుల వీరంగం

జానపదుల నమ్మకం ప్రకారం ఏడుగురు అక్కాచెల్లెళ్ళకు ఒక్క సోదరుడు, ఆ ఏడుగురు దేవతలకు రక్షకుడు- పోతురాజు! ఊరందరికీ అమ్మవారు రక్షణ అయితే, ఆ అమ్మవారికి రక్షణ కవచం లాంటి వాడు పోతురాజు అని నమ్మకం. ఈ బోనాల జాతరలో ఈ పోతరాజులు అమ్మవారి స్వాగతం- ఊరేగింపులలోనే కాక, 'సాగతోలుడు' సందర్భంలో కూడా కీలకంగా వ్యవహరిస్తారు.

ఆనాడు పోతురాజులకు ప్రతీకలుగా ఎంతోమంది వీరభక్తులు పోతురాజు వేషాలలో వీరంగం వేస్తూ, చిందులు వేస్తూ, ఊరేగింపును, జాతరను ఎంతో ఉద్వేగభరితంగా, ఉత్తేజ పూరితంగా చేస్తారు. వీరు శరీరమంతా పసుపును దట్టంగా పూసుకొని, కాటుకతో కళ్ళను దిద్దుకొని, పెద్ద కుంకుమ బొట్టుతో నోటిలో పచ్చని నిమ్మకాయలు కరచుకొని, నడుం చుట్టూ వేపమండలు కట్టుకొని, పసుపు తాడు కొరడాని ఝులిపించుకుంటూ, లంగోటీ గజ్జెలు కట్టుకొని, డప్పులు- డోళ్ళు వాయిద్యాలకు అనుగుణంగా చిందులు వేస్తూ కదిలిపోతుంటాడు. ప్రత్యేక ఆకర్షణగా కనిపించే ఈ పోతురాజు ఇప్పుడు ఒక్కరుగా కాకుండా సమూహంలాగా చాలా మంది కలిసి ఊరేగింపుగా వెళ్ళడం భయోద్విగ్న ఉత్సాహాన్ని కలిగించే సందర్భం.

అయితే ఈ పోతురాజులు చిందులు వేస్తూ, కొరడా ఝుళిపిస్తూ ఊరేగింపు చేస్తూ, ఊరు ఊరంతా నేలమీద, గాలిలో పసుపును, వేప గాలులను వెదజల్లుతారు, దీని వల్ల గాలిలో, నేల మీద ఆషాడమాసపు కొత్తనీళ్ళకు పుట్టుకొచ్చిన వ్యాధికారక క్రిములు, బ్యాక్టీరియా, వైరస్లు నశిస్తాయని, ఈ పోతురాజుల వేషాల వెనుక దాగిన శాస్త్రీయత ఇదని చెపుతారు.

వీరు చేతిలోని కొరడా (వీరగోల) తో హడలగొడుతూ, విరబోసుకున్న జుట్టు, బాణపొట్టతో వీరత్వాన్ని ప్రదర్శిస్తూ చిందులేస్తారు. కొన్నిచోట్లలోని పోతరాజులలో నాలుకకు కత్తులు, గుచ్చుకునే సంప్రదాయం ఉంది.

## 9. శివసత్తులు - శివాలు

మహిళలలో శివున్ని ఆరాధించేవారు. జోగినిలు, అతిభక్తి పారవశ్యంలో ఉన్నవాళ్ళు అమ్మవారి ఊరేగింపులో 'శివాలు' ఊగడం ఓ విశేషం. శివసత్తులుగా శివుని దాసీలుగా భావించే ఈ స్త్రీలు వెంట్రుకలు విరబోసుకొని, చేతిలో చిన్న త్రిశూలాలతో వేపమండలతో, నెత్తిమీద బోనాల కుండలతో విన్యాసాలు చేస్తారు. వీరికి ఊదుపొగ వేస్తారు. దాంతో ఒళ్ళు మరిచి చిందులు వేయడాన్ని 'శిగమూగడం'' అంటారు.

## 10. గావు పట్టడం

వీరావేశంలో ఉన్న పోతురాజు అమ్మవారి గుడి ప్రాంగణంలో ఏదైనా జంతువు మెడను తన పండ్లతో కొరికి ప్రాణం తీసి, దాంతో వచ్చిన రక్తాన్ని చిమ్మే తంతును 'గావు పట్టడం' అంటారు. ఊరికి, ప్రజలకి పట్టిన ఎలాంటి దుష్ట శక్తి, అరిష్టం వంటి వన్నీ ఈ తర్పణంతో తొలిగిపోతాయని అనాదిగా వస్తున్న జానపదుల నమ్మకమే ఈ సంప్రదాయం ఏర్పడటానికి కారణం.

అయితే క్రమక్రమంగా ఈ 'గావు పట్టే' సంప్రదాయం దున్నపోతు నుండి మేకపోతుకి, ఆ తర్వాత కోడిపుంజుకి బదిలీ అయి ప్రస్తుతం 'ఆనెపు కాయ' (సొరకాయ) లకు పరిమితం అయింది.

ప్రస్తుతం పోతరాజులు అరుస్తూ, కేకలు వేస్తూ, డప్పు వాయిద్యాలకు చిందులు వేస్తూ గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఆనెపుకాయలను కొరికేస్తూ ఈ 'గావుపట్టడం'ను చేస్తుంటారు.






శ్రీ శ్రీ శ్రీ మహాంకాళి

### 11. రంగం

బోనాల జాతరలో రెండోరోజు జరిగే కార్యక్రమం- 'రంగం'. రంగం! అంటే అలంకరించబడిన ప్రదర్శనా పీఠం. గుడిలోని అమ్మవారు కన్య అయిన ఓ మహిళను ఆవహించి 'భవిష్యవాణి'ని వినిపించేదే రంగం.

ఈ సంప్రదాయంలో లీనమై, ప్రతి ఏటా పవిత్రంగా ఉండి అవివాహితగా ఉన్న మహిళ, అమ్మవారి 'పూనకం'తో ఈ రంగం చెపుతుంది. విరబోసుకున్న వెంట్రుకలు, ముఖం నిండా పసుపు పూసుకొని, పెద్ద బొట్టు పెట్టుకొని అమ్మవారి ప్రతిరూపంలా ఊగిపోతూ, పూనకంలో ఊరుకు, దేశానికి సంబంధించిన భవిష్యత్తు విశేషాలను, అతివృష్టి, అనావృష్టి, ఆరోగ్యం వంటి అనేక విషయాలను చెపుతుంది. ఆమె ఈ 'రంగం' చెప్పేటప్పుడు పచ్చికుండ (కాల్చని కుండ) మీద ఎక్కి దేశం, ధర్మం, పాలకులు, పాడిపంటలు, కాలం గురించి, ప్రమాదాల గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెపుతుంది. అనేక విషయాలు చెప్పి అలసిపోయాక, ఆమెకు మంగళ హారతులిచ్చి, శాంతింప చేసి దండాలు పెట్టుకుంటారు.

ఇక, రంగం చెప్పడానికి పచ్చికుండనే ఎందుకు? అంటే, పూనకంతో ఉన్న మహిళలోకి అమ్మవారు ప్రవేశించాక ఆ మహిళ 'తన బరువు'ను కోల్పోతుందని, అది నిరూపించడానికే పచ్చికుండపై నిలబెడతారని విశ్వాసం. కాల్చిన కుండయితే గట్టిపడి బరువును మోయగలుగుతుంది కానీ పచ్చికుండ ఆ పని చేయలేదు. అయితే అమ్మవారు ఆవహించడం వల్ల అసాధ్యం సుసాధ్యం అవుతుందని నిరూపించడం, అమ్మవారి మహాత్మ్యాన్ని సామాన్యులకు చెప్పడమే దీని ఉద్దేశమని ప్రజల విశ్వాసం.

# బోనాలు-ఆషాఢ విశేషం - శాస్త్రీయత - నవ్య సాంప్రదాయం

ప్రపంచవ్యాప్తంగా ఉండే అన్ని సమాజాలలో వ్యవహారంలో ఉండే ప్రతీ క్రతువు, ఆచారం వెనుక ఒక శాస్త్రీయత, అప్పటి సామాజికావసరం ఉంటుందనే మాటల్లో నిజం ఉంది అనే చెప్పాలి. ఆనాటి సమాజంలో వ్యక్తులలో 'నియతి'ని, క్రమతని (Order) ని స్థాపించడం ద్వారా సామాజిక సుస్థిరత (Stability) ని, సుస్థితి (Normalcy) ని సాధించడానికి భగవంతుని పేరిట, మతం పేరిట, కట్టుబాట్లని, ఆచారాలని నిర్బంధం చేసారు. అయితే నవీన యుగంలో వాటిలోని శాస్త్రీయతని, చారిత్రక అవసరాన్ని ఆధునిక దృక్పథంలోంచి విశ్లేషిస్తూ సంప్రదాయాలలోని ఔన్నత్యానికి కొత్త అర్థ వివరణ ఇస్తున్నాం. ఈ విధానాన్ని నవ్య సంప్రదాయవాదం (Neo- Classicism) అని మానవ పరిణామ శాస్త్రజ్ఞులు, సామాజిక శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఈ కోణంలోంచి ఆలోచిస్తే, 'బోనాల జాతర'లో కూడా ఎన్నెన్నో శాస్త్రీయ విలువలు, ఆరోగ్య సూత్రాలు, మానవ జాతి మనుగడ కోసం రూపొందించిన అంశాలు నిబిడీకృతమై కనిపిస్తాయి. ఈ విశ్లేషణ ఈ ఉత్సవాలు జరిపే కాలం (Season), మనుషులలో, జంతువులలో వచ్చే మార్పులు, వంటి ప్రమాణాల ఆధారంగా చెప్పవచ్చు.

బోనాలు ఆషాఢ మాసంలో జరిగే ఉత్సవాలు. ఋతు కాలగమనాల పరంగా ఈ కాలం వ్యాధులకు, రోగాలకు ఎంతో అనువైన సమయం. వేసవి కాలం ముగిసి, వర్షాలు విస్తారంగా పడే కాలం కావడం, రెండు భౌతిక కాలాల మధ్య సంధికాలం (Transition Season) కావడం వల్ల మనుషులు, జంతువుల దేహాలు, ఆరోగ్యాలు ఈ మార్పులకు తొందరగా సర్దుబాటు చేసుకోలేవు. దానివల్ల రోగనిరోధక వ్యవస్థ (Immune System) కొంత అస్తవ్యస్థతకు లోనవుతుంది.

అలాగే ఈ ఋతువులో భూమి నుండి రకరకాల పురుగులు పుట్టుకొస్తాయి. అందుకే దీన్ని 'ఈగకాలం' అంటారు. ఉసిళ్ళు, గొంగడి పురుగులు, అప్పడాల గుర్రాలు, ఆరుద్ర పురుగులు వంటివి ఈ కాలంలోనే కనిపిస్తాయి. అంతేకాక, కొత్తనీరు, ఆకాశం మబ్బుపట్టి ఉండటం వల్ల సూర్యుడు ఎండవేడిమి ఇళ్ళల్లో, దేహాలపై ప్రసరించకపోవడం వంటి వాటివల్ల పిల్లలకు, పెద్దలకు కళ్లకలక, పసికలు, మశూచి, ఆటలమ్మ, దద్దులు, కక్కుడు, పారుడు, చలిజ్వరాలు ఎక్కువగా వస్తాయి. కోళ్ళకు, గొడ్లకు, దుడ్డెలు, బర్రెలకు ఇతర పశువులకు, జంతువులకు కూడా 'గాలి' రోగం సోకుతుంది. దీనివల్ల ఈ పశువులు నిస్సత్తువయై సొమ్మసిల్లి సొంగకారుస్తూ పడి ఉంటాయి. సహజమైన ఉత్సాహంతో ఉండవు. వానల వల్ల పచ్చగడ్డి మొలిచి నవనవలాడుతున్నా తినవు. ఈగలు ముసురుతున్నా నిస్సత్తువగా ఉంటాయి. లేగదూడలను కూడా దరికి చేరనీయవు.

ఇక మనుషులలో ముఖానికి 'పోశమ్మ' (Smallpox), గత్తర (విరోచనాలు), ఆటలమ్మ (Chickenpox) వంటివి పట్టి పీడిస్తాయి.

ఇలా త్వరితగలిన వ్యక్తినుంచి వ్యక్తికి విస్తరించే రోగాలు, వ్యాధులకు విరుగుడు ఒక్క వ్యక్తి, కుటుంబమో కాకుండా మొత్తం పల్లెపల్లెంతా సామూహికంగా పూనుకోవడం వల్లనే వీటిని అరికట్టవచ్చునేది సత్యం ఈ తెలివైన ఆలోచనే ఈ బోనాల జాతర పుట్టుకకు అసలైన శాస్త్రీయ కారణం.

గ్రామీణులు, పామర ప్రజలు, నిరక్షరాస్యులైన ప్రజలకు ఆరోగ్యం, శుచి-శుభ్రత వంటి అంశాల పట్ల ఉన్నదున్నట్లుగా (as it is) అవగాహన కల్పించడం కన్నా, దీని కోసం చేసే నివారణా చర్యలనే ఓ కట్టుబాటుగా, క్రతువుగా, సంప్రదాయంగా చేయడం ద్వారా, ఈ ఆరోగ్య యజ్ఞంలో అందరినీ భాగస్వాములను చేయవచ్చని ఆనాడు భావించిఉండవచ్చు.

వర్షాకాలంలో వచ్చే రోగాలను నయం చేయగలిగే వస్తువులతోనే ఈ బోనాలను నిర్వహించడం ఈ విశ్లేషణకు బలాన్ని చేకూరుస్తున్నది.

బోనంను పసుపు, బెల్లం, నీరు, బియ్యం కలిపి తయారుచేయడం. దానిని ప్రసాదంగా భక్తితో అందరూ ఆరగించడం ద్వారా పసుపులో ఉండే యాంటీ బయోటిక్స్ మన దేహంలోని రోగ కారకాలను నాశనం చేస్తాయి.

మట్టికుండలని పసుపు కుంకుమలతో అలంకరించి, వేపరెమ్మలను వరుసగా చుట్టడం, ఈ కుండలని తలపై మోస్తూ ఊరంతా తిరుగుతూ అమ్మవారి ఆలయానికి రావడం వల్ల గాలిలో, వాతావరణంలో ఉండే కల్మషాలు, కాలుష్యాలు, వ్యాధికారక క్రిములు నశిస్తాయి.

స్త్రీలు పాదాలనిండా పసుపు పూసుకోవడం, చెప్పులేవీ లేకుండా ఊరివీధులగుండా పాదయాత్రగా రావడం వల్ల పాదాలలోని పసుపు నేలపై రాలి భూమిని ఆశ్రయించి ఉండే వ్యాధి కారకాలని అంతం చేస్తాయి.


ముఖానికి పూసుకొనే పసుపు స్త్రీలలో వ్యక్తిగతంగా ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుంది.

మరోవైపున, మట్టికుండపై వెలిగే జ్యోతి, మట్టి కుండ "కంటె" చుట్టూ కట్టిన వేపకొమ్మలు-ఆకులలో ఉండే రసాయనాలను జాగృతం చేసి గాలిలోకి వెదజల్లేలా చేస్తుంది. గాలి రోగాలను అంతం చేసి మనుషులను, పశువులను రక్షిస్తుంది.

ఈ వ్యవహారం ఒక్క రోజుకే పరిమితం చేయకుండా నెలరోజుల పాటు, ఆషాఢ మాసం అంతటా చేయడం వల్ల సామూహికంగా అందరికీ ఆరోగ్య స్వాంతన చేకూరుతుంది.

బహుశా, ఈ విషయాలను దృష్టిలో ఉంచుకునేనేమో, ప్రతాపరుద్ర చక్రవర్తి కాకతీదేవికి బలిపూజలను ఆషాఢ మాసంలోనే నిర్వహించేవాడు. ఉత్సవం ఆఖరి రోజున కాకతీ అమ్మవారికి రాశులు రాశులుగా బోనం సమర్పించి, ప్రజలందరికీ అన్నదానం చేసేవారని చారిత్రక ఆధారాల వల్ల తెలుస్తోంది.

ఇదీ, ఆషాఢ మాస బోనాల జాతరలోని శాస్త్రీయత. సాంస్కృతికంగా, భక్తిపూర్వకంగా, మతపరంగా జరుగుతున్న ఈ ఆరాధనా క్రతువులో అంతర్గర్భితంగా ఇమిడి ఉన్న లోక కళ్యాణం... సకల జన సంక్షేమం!







# ధన్యవాదములు

## గౌ॥ శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు
గౌరవ ముఖ్యమంత్రివర్యులు

**గౌ॥ శ్రీ జూపల్లి కృష్ణారావు గారు**
ఎక్సైజ్, ప్రొహిబిషన్, సాంస్కృతిక పర్యాటక
పురావస్తు శాఖామాత్యులు

**గౌ॥ శ్రీమతి కొండా సురేఖ గారు**
అటవీ, పర్యావరణ,
దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు

**గౌ॥ శ్రీ పొన్నం ప్రభాకర్ గారు**
రవాణా, బి. సి. అభివృద్ధి శాఖామాత్యులు

**గౌ॥ శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు గారు**
పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలు,
వాణిజ్య, IT శాఖామాత్యులు

**గౌ॥ శ్రీ జయేష్ రంజన్ గారు IAS**
స్పెషల్ ఛీఫ్ సెక్రటరి, పర్యాటక, సాంస్కృతిక,
పురావాస్తు, క్రీడాశాఖలు

**గౌ॥ శ్రీమతి శైలజ రామయ్యర్ గారు IAS**
ప్రిన్సిపల్ సెక్రటరీ, చేనేత హస్తకళలు
దేవాదాయ ధర్మాదాయ శాఖ

**గౌ॥ శ్రీ ఎస్. వెంకటరావు గారు IAS**
సంచాలకులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ

**గౌ॥ శ్రీ శ్రీనివాసరాజు గారు IAS (రి)**
ముఖ్యమంత్రి గారి ప్రిన్సిపల్ సెక్రటరి

*ధన్యవాదములతో....*

**- డా॥ మామిడి హరికృష్ణ**

బోనాలు –
మాతృదేవతారాధనకు సంకేతాలు
ఆడబిడ్డలు భక్తిగా జరిపే ఉత్సవాలు
మహా నగరం కాపాడుకున్న పల్లె జీవితానికి చిహ్నాలు!

బోనాలు –
'సింధు నాగరికత' నాటి 'అమ్మ తల్లి'కి కొనసాగింపులు
ద్రవిడ జీవన సంస్కృతికి నిదర్శనాలు
ప్రకృతికి మానవాళి అందించే కృతజ్ఞతలు!!

బోనాలు –
శివసత్తులు, పోతురాజులు, పొట్టేళ్ల ప్రణామాలు
పసుపు, వేపాకు, నిమ్మకాయల నీరాజనాలు
మనిషికి – పర్యావరణానికి ఉన్న అనుబంధానికి ఆనవాళ్లు!!!

బోనాలు –
తెలంగాణ మహిళా శక్తికి సూచికలు
తెలంగాణ జాతి అస్తిత్వ పతాకలు
తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక గీతికలు!!!!

- డాక్టర్ మామిడి హరికృష్ణ




9 788196 563691

భాషా సాంస్కృతిక శాఖ
కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్.

దేవాదాయ ధర్మాదాయ శాఖ
తిలక్ రోడ్, హైదరాబాద్